

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్, జూలై 24: జాతీయ అవార్డుల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన, దివ్యాంగుల సాధికారితకు కృషి చేస్తున్న వారికి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందించనుందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అవార్డ్సు.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌ను చూసుకోవాలని సూచించారు.

పాలన గాడిన పడేనా?



నూతన పీవో రాహుల్‌కుమార్ రెడ్డి



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం



- సీతంపేట ఐటీడీఏలో కీలక పోస్టులు ఖాళీ..
- ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం
- మరికొందరు మైదాన ప్రాంతాల నుంచి రాకపోకలు
- గిరిజనులకు పూర్తిస్థాయిలో అందని సేవలు
- నూతన పీవోపైనే ఆశలు

సీతంపేట

సీతంపేట ఐటీడీఏలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏళ్లుగా ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. పరాయి శాఖకు చెందిన అధికారులను నియమిస్తుండగా.. వారు ఆ బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేర్చకపోవడం పరిపాటిగా మారింది. మరోవైపు ఐటీడీఏలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు స్థానికంగా నివాసం ఉండడం లేదు. అత్యధికులు మైదాన ప్రాంతాల నుంచి రోజూ సీతం పేటకు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గిరిజనులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. కాగా ఈ సమస్యలపై నేడు విధుల్లో చేరనున్న నూతన ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి దృష్టి సారించాల్సి ఉంది. గతంలో ఆయన శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఈ ప్రాంతంపై ఆయనకు కొంతవరకు అవగాహన ఉన్న నేపథ్యంలో పీవోపై గిరిజనులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. కీలక శాఖల్లో పోస్టులను భర్తీ చేసి.. పాలనకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఐటీడీఏలో ఇదీ పరిస్థితి..

- సీతంపేట ఐటీడీఏలో మేనేజర్, అకౌంటెంట్ పోస్టులను గత ఐదేళ్లగా భర్తీచేయలేదు.
- ప్రాజెక్టు వ్యవసాయ అధికారి ఇటీవల బదిలీపై వెళ్లిపోవడంతో ప్రాజెక్టు ఉద్యాన శాఖాధికారి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
- ఐటీడీఏ ఏపీవో వచ్చేనెల 20 వరకు సెలవు పెట్టారు. దీంతో ఆ బాధ్యతలను పీహెచ్‌వోకు అప్పగించారు.
- ఉప వైద్యాధికారికి అదనంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా బాధ్యతలను అప్పగించారు. దీంతో రెండు పోస్టులకు న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మండలంలో మలేరియా విజృంభిస్తోంది. ఆసుపత్రులన్నీ జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య సేవలపై ఉపవైద్యాధికారి పర్యవేక్షణ లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్‌కు విశాఖపట్నం ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ అదనపు బాధ్యతలను అప్పగించారు. కాగా
- వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లాకు చెందిన పశుసంవర్ధకశాఖ ఏడీకి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ శాఖపై కనీస అవగాహన లేకపోయినప్పటికీ ఆయన వారానికి మూడుసార్లు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఆ శాఖ లావాదేవీలు, రైతు ఉత్పత్తి సంఘాల అభివృద్ధి మందగించిందనే ఆరోపణలున్నాయి.

ఈ ప్రాంతంలో డివిజనల్ మేనేజర్ పర్యవేక్షణ లేకపోవడంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- స్త్రీ శిశు సంక్షేమశాఖకు సంబంధించి ఎనిమిది మంది సూపర్‌వైజర్లు ఉండాలి. అయితే నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమందికి అదనపు సెక్టార్లను అప్పగించడంతో పాలనాపరమైన ఇబ్బందులు తప్పడం లేదు.
- గృహ నిర్మాణ శాఖకు గత ఐదేళ్లుగా రెగ్యులర్ ఏఈ లేరు.
- సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఒప్పంద ఉపాధ్యాయుల నియామకానికి గాను ఇంతవరకు రెన్యువల్ ఆర్డర్లు అందజేయలేదు. సవర భాషా వలంటీర్లకు కూడా రెన్యువల్ పత్రాలు ఇవ్వలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు.



రూ.25 కోట్లతో విస్తరణ

- పైడిమాంబ దేవస్థానం అభివృద్ధికి డీపీఆర్
- అంతరాలయం నుంచి అన్నదాన భవనం వరకు..
- సిరిమానోత్సవం తరువాతే పనులు

(విజయనగరం రూరల్)

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం.. సిరుల తల్లి పైడిమాంబ దేవస్థానం (చదురుగుడి) అభివృద్ధికి రూ.25 కోట్లతో డీటైల్డు ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ని సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. గత నెలలో దేవదాయ శాఖ నుంచి ప్రముఖ ఇంజనీర్లు వచ్చి చదురుగుడి వద్ద కొలతలు తీసుకుని వెళ్లారు. కొత్త ప్రణాళిక ప్రకారం శాశ్వత ప్రాతిపదికన క్యూ లైన్లు, ప్రసాదం కౌంటర్, తలనీలాలు సమర్పించే గది ఏర్పాటు చేస్తారు. మరో 50 ఏళ్ల వరకూ దేవస్థానం విస్తరించే పనిలేకుండా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. డీపీఆర్ ప్రకారం అంతరాలయం పూర్తిగా విస్తరించనున్నారు. ప్రస్తుతం భక్తులు దర్శించుకునే క్యూలైన్లు మూడు వున్నాయి.. ఒకటి ఉచిత దర్శనం.. రెండోది ప్రత్యేక దర్శనం (రూ.20 లేదా రూ.50 టిక్కెట్), మూడోది వీఐపీల లైను. ఈ మూడూ విశాలం కానున్నాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిలో వున్న దుర్గాదేవి ఆలయం మాదిరిగా ఎంత మంది క్యూలో వున్నా దర్శనం కోసం వేచి వుండకుండా నేరుగా భక్తులు దర్శనం చేసుకుని వెళ్లేలా డీపీఆర్ రూపొందించారు. మరోవైపు ఆలయానికి ఆనుకుని (పాత సీటీస్కాన్) తాత్కాలికంగా అన్నదాన మండపం ఏర్పాటు చేశారు. భక్తులు దర్శనం చేసుకున్న తరువాత ప్రసాదం తీసుకుని నేరుగా అన్నదానానికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక వీఐపీలు వచ్చినప్పుడు పూజానంతరం వేదాశీర్వచనం అందించేందుకు వీలుగా ప్రత్యేక మండపం ఏర్పాటు చేయాలనుకుంటున్నారు.

సిరిమానోత్సవం తరువాతే విస్తరణ

పైడిమాంబ ఆలయాన్ని ఏ విధంగా విస్తరించాలి? ఏ ప్లాన్ ప్రకారం వెళ్లాలన్న దానిపై ఇంజనీర్లు మూడు, నాలుగు రకాల ప్లాన్‌లు సిద్ధం చేస్తున్నారు. రూ.25 కోట్ల నిధులు అవసరం పడతాయని దేవస్థానం అధికారులు ఒక అంచనాకు వచ్చారు. అక్టోబరులో జరిగే సిరిమానోత్సవం అనంతరం ఆలయ విస్తరణ పనులు ప్రారంభమయ్యే అవకాశం వుంది. ఆగస్టు 5 నుంచి పైడిమాంబ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు, అక్టోబరులో దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు, అనంతరం సిరిమానోత్సవం జరుగుతాయి. ఆ తర్వాత ఏడాదిలోగా (2025 అక్టోబరులోగా) విస్తరణ పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం.

నాలుగు గంటలు

స్తంభించిన ట్రాఫిక్

- అలికాం-బత్తిలి రోడ్డుపై గుంతలో దిగబడిన లారీ
- భారీగా నిలిచిన వాహనాలు
- ప్రయాణికులు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- తరచూ ఇదే సమస్య..
- నూతన ప్రభుత్వం స్పందించాలని ప్రజల విన్నపం





వాహనాలు నిలిచిపోవడంతో నడుస్తూ స్వగ్రామాలకు వెళ్తున్న విద్యార్థులు



గురండి సమీపంలో గుంతలో దిగబడిన లారీ

భామిని: భామిని మండలంలో గురండి, బిల్లుమడ సమీపంలోని రహదారిపై గుంతలో ఒడిశా నుంచి వస్తున్న ఓ లారీ దిగబడింది. దీంతో నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు రోడ్డుకిరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ జామ్ కారణంగా బత్తిలి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు బిల్లుమడ నుంచి వెనుదిరిగాయి. దీంతో బత్తిలికి చెందిన విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి ఎలా చేరుకోవాలో తెలియక టెన్షన్ పడ్డారు. స్థానికుల సాయంతో తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించారు. మరికొంతమంది కాలినడకనే స్వగ్రామానికి చేరుకున్నారు. ఇరుక్కున్న లారీ పక్కనే భారీ గుంత ఉండడంతో వాహనాలు ఆ పక్క నుంచి ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయింది. చివరకు రెండు ఎక్స్‌కవేటర్లతో లారీను పక్కకు తప్పించడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి. వాస్తవంగా ఈ మార్గంలో నిత్యం ఒడిశా, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే దారి పొడవునా భారీ గోతులు ఏర్పడడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రధానంగా బిల్లుమడ నుంచి పసుకుడి వరకు అలికాం-బత్తిలి రహదారి అడుగుకో గుంతతో దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో వర్షపునీరు చేరగా.. కొన్నిచోట్ల రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఏ గుంతలో ఏ వాహనం దిగబడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా వీలులేని విధంగా రోడ్డు మారింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ రహదారి ఇలా తయారైందని, కొత్త ప్రభుత్వం దృష్టిసారించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

జ్వరాలపై నిరంతర సర్వే

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- రోగులకు మెరుగైన వైద్యం అందించండి
- వైద్యాధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్, జూలై 24 : జ్వరాలపై నిరంతర సర్వే కొనసాగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఒక గ్రామంలో జ్వరం కేసు నమోదు అయితే ఆ ప్రాంతంలో ప్రతి ఒక్కర్నీ పరీక్షించాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కడా నమోదు కాకుండా చూడాలన్నారు. అనుమానాస్పద కేసులు ఉంటే.. అన్ని పరీక్షలు చేసి మెరుగైన వైద్యాన్ని అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. సీతంపేట, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాలపై మరింతగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, మాదలంగి, దుడ్డుకల్లు, మర్రిపాడు తదితర పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనత, మాతృ శిశు మరణాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, మలేరియా అధికారి వై.మణి, ఇమ్యునైజేషన్ అధికారి నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్, ప్రోగ్రాం అధికారులు వినోద్, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై దృష్టి

పార్వతీపురం టౌన్ : జిల్లాలో రైతు సమస్యలపై దృష్టి సారించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అన్నదాతలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో మాట్లాడుతూ.. కౌలు రైతుల రుణ దరఖాస్తు ప్రక్రియ వేగ వంతం చేయాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పశుసంపద, ప్రకృతి వ్యవసాయంపై ఏ ప్రాంత ప్రజలు ఆసక్తి చూపుతున్నారో తెలుసుకుని ఆ దిశగా ప్రోత్సహించాలని ఆదేశించారు. ముందుగా ప్రకృతి సాగుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించేలా చూడాలని సూచించారు. రసాయనిక మందులు, ఎరువులకు దూరంగా ఉండేలాచూడాలన్నారు. కరపత్రాలు, వీడి యోల ద్వారా ప్రకృతి సాగుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాసెసింగ్ యూనిట్స్, ఆర్గానిక్, ఎఫ్‌బీఏ ఉత్పత్తుల స్టాల్స్ లేదా ఇతర మార్గాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కిచెన్ గార్డెన్ సాగుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐరన్ సమృద్ధిగా ఉన్న పంటలను సాగు చేపట్టేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

తరలించేస్తున్నారు

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా తవ్వకాలు.. ఇతర ప్రాంతాలకు రవాణా
- నిబంధనలకు తిలోదకాలు
- ఆగని ఇసుక దందా
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొమరాడ: జిల్లాలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అక్రమంగా ఇసుకను తరలించి రెండు చేతులా సంపాదిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు జరిపి ఇసుక దందా సాగిస్తున్నారు. ప్రధానంగా పార్వతీపురం పట్టణం, కొమరాడ మండలానికి అతి సమీపంలో నాగావళి, జంఝావతి నదుల నుంచి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రశ్నించే వారే లేకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు పోటా పోటీగా ఇసుకను తరలిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నదుల నుంచి ఎడ్ల బళ్లతో ఇసుకను తీసుకువచ్చి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. అనంతరం ట్రాక్టర్లకు లోడు చేసి.. పార్వతీపురం పట్టణానికి తరలిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఏకంగా నది ఒడ్డున ట్రాక్టర్‌లో ఇసుక లోడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనిపై కొంతమంది అధికార యంత్రాంగానికి సమాచారం ఇచ్చినప్పటికీ.. అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా ఇసుక ఉచిత విధానం.. ఇసుకాసురులకు వరంగా మారింది. ఇసుకను అక్రమంగా తరలిస్తూ తమ జేబులను నింపుకుంటున్నారు. వాస్తవంగా జిల్లాలో ఉన్న వాగులు, గెడ్డల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. నాటుబళ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను తెచ్చుకోవచ్చు. అయితే ఏ గ్రామంలో ఉన్న గెడ్డ, వాగుల నుంచి ఆ గ్రామస్థులు మాత్రమే ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతిస్తారు. ఇతర గ్రామాలకు తరలించేందుకు అనుమతించరు. కానీ ఇసుకాసురులకు ఈ నిబంధనలేవీ పట్టడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ విధంగా అయితే ఇసుక అమ్మకాలు సాగించి.. సొమ్ము చేసుకున్నారో.. ఇప్పుడు కూడా అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా టీడీపీ కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక దోపిడీని అరికట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు. దీనిపై కొమరాడ తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా.. 'అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరం. ఎవరైనా ఇసుక తరలింపులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు' అని ఆయన తెలిపారు.



గుంప నాగావళి తీరంలో ట్రాక్టర్లకు ఇసుకను లోడింగ్ చేసిన దృశ్యం



సలహా.. సూచనలు అందించండి

- స్పీకర్‌ను కోరిన మంత్రి, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి)/ సాలూరు: శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును బుధవారం ఆయన చాంబర్‌లో గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా సుదీర్ఘకాలం పనిచేసిన స్పీకర్ సలహాలు, సూచనలు తమకెంతో అవసరమని ఆమె తెలిపారు. రాష్ట్ర, జిల్లా అభివృద్ధి కోసం పనిచేస్తున్న వారికి తన ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని స్పీకర్ చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడును కలిసిన వారిలో కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ తదితరులు ఉన్నారు.



ప్యారిస్ వేదికగా శుక్రవారం నుంచి ఒలింపిక్స్ జరుగుతున్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా లండన్ చేరుకున్నారు. అక్కడున్న హైడ్ పార్క్‌లో రామ్‌చరణ్, ఉపాసన, మనవరాలు క్లీంకారాతో ప్రకృతిని ఆస్వాదిస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గురువారం మెగా కుటుంబం పారిస్ వెళుతుంది.

గుర్తుండిపోయే పాత్ర



సందీప్ కిషన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. తమిళ నటుడు ధనుశ్ స్వీయ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. కళానిధి మారన్ నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ధనుశ్ నటించిన 50వ చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే తగ్గట్లే ఆయన ప్రతీ విషయంలో జాగ్రత్త పడ్డారు. అద్భుతమైన స్ర్కీన్‌ప్లేతో నడిచే ఈ సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకం. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఇది. సినిమాలో యాక్షన్ మాత్రమే కాకుండా మనసుకు హత్తుకునే భావేద్వేగాలు, అందరినీ అలరించే వినోదం ఉంటుంది. ఇది 'రాయన్' అనే ఇంటిపేరు గల ఓ ఫ్యామిలీతో ముడిపడిన కథ. సినిమాలో వచ్చే ప్రతీ పోరాట ఘట్టం ప్రత్యేకంగా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు. ఏ.ఆర్. రెహమాన్ అందించిన పాటలు సినిమాకు అదనపు ఆకర్షణ" అని చెప్పారు.

అంతర్యుద్ధాన్ని ఆవిష్కరించేలా...



'పలాస 1978', 'నరకాసుర' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మీడియాతో ముచ్చటించారు.

"ఇది కొత్తతరానికి బాగా చేరువయ్యే థ్రిల్లర్. నాన్న వెంకట సత్యకు దర్శకుడిగా ఇది తొలి సినిమా అయినా ఎక్కడా తడబడలేదు. ఈ సినిమా ప్రతీ మనిషిలో జరిగే ఆలోచనల అంతర్యుద్ధాన్ని కొత్తగా ఆవిష్కరిస్తుంది. ఇందులో నేను ఆనంద్ శ్రీరామ్ అనే టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఓ విభిన్నమైన ప్రేమ కథ కూడా ఉంటుంది. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్‌గా చూపిస్తుంది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులు తమ టికెట్‌కు వంద శాతం న్యాయం జరిగిందని భావిస్తారు" అని చెప్పారు.

బెల్లంకొండ... కొత్త కబురు



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. 'బీఎస్ఎస్ 12' వర్కింగ్ టైటిల్. లుధీర్ బైరెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో కల్ట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోందని నిర్మాతలు తెలిపారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్ ఆర్.

హీరోగా రాజ్‌తరుణ్ అందుకే



రాజ్‌తరుణ్, హాసిని జంటగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకత్వంలో డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్‌భీమన, నిర్మాత డా.రమేశ్ తేజావత్, హీరోయిన్ హాసిని మీడియాతో ముచ్చటించారు. దర్శకుడు రామ్‌భీమన మాట్లాడుతూ "మా బడ్జెట్‌కు తగ్గ హీరో కోసం అన్వేషిస్తున్న క్రమంలో రాజ్‌తరుణ్ అయితే అన్ని విధాలా బావుంటుందనిపించింది. అందుకే ఆయన్ను హీరోగా తీసుకున్నాం" అని చెప్పారు. నిర్మాత డా. రమేశ్ తేజావత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబమంతా కలసి చూసేలా సినిమాను రూపొందించాం. ప్రతీ సన్నివేశాన్ని ఎంతో క్వాలిటీతో తెరకెక్కించాము" అని తెలిపారు. హీరోయిన్ హాసిని మాట్లాడుతూ "ఇందులో నాకు, రాజ్ తరుణ్‌కు మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అద్భుతంగా ఉంది. నేను పోషించిన పాత్ర అందరికీ నచ్చుతుంది. సినిమాలో ఏడు పాటలున్నాయి. వేటికవే ప్రత్యేకంగా ఉండే ఆ పాటలు తెరపై ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి" అని చెప్పారు.

పాటల రేవులో సాహితీ సంగమం



మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించే ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'రేవు' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఆగస్టు రెండో వారంలో విడుదల కోసం సిద్ధమైంది. ఈ సినిమా ఆడియో వేడుక బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. ఐదుగురు ప్రముఖ గీతరచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొనడం ఒక విశేషమైతే, చాలా ఏళ్ల తర్వాత క్యాసెట్ రూపంలో ఈ ఆడియోను విడుదల చేయడం మరో విశేషం. గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ 'నవ్యత, నాణ్యత ఈ చిత్రంలో కనిపించాయి. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. 'కంటెంట్ ఉన్న వైవిధ్యమైన సినిమాలు రావాలంటే పర భాషల వైపు చూస్తుంటాం. కానీ 'రేవు' సినిమా పాటలు విన్నాక కొత్తతరం ప్రతిభావంతులపై నమ్మకం ఏర్పడుతోంది' అన్నారు రామజోగయ్య శాస్త్రి. తనలాగానే గీత రచయిత ఇమ్రాన్ శాస్త్రి మొదటి సినిమాకే సింగిల్ కార్డ్ పొందారని అనంత శ్రీరామ్ అభినందించారు. అక్షరాలన్నీ కలసినట్టుగా ఈ వేదిక ఉందని సుద్దాల అశోక్‌తేజ అభినందించారు. 'రేవు' చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు మాట్లాడుతూ 'ఒక చిన్న సినిమాను సపోర్ట్ చేయడానికి ఇంతమంది గీత రచయితలు రావడం ఆనందంగా ఉంది. దర్శకుడు హరనాథ్ మత్స్యకారుల జీవన పోరాటాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు' అని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాతలు, మిత్రులు మురళీ గింజుపల్లి,నవీన్ పారుపల్లి నా మీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలా 'రేవు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళతాం' అని చెప్పారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



అనసూయ, జగపతిబాబు ప్రధాన పాత్రలు పోషించిన 'సింబా' చిత్రం ఆగస్టు 9న విడుదల కానుంది. మురళీ మనోహర్ దర్శకత్వంలో దాసిర రాజేంద్రరెడ్డి నిర్మించిన చిత్రమిది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతూ ' చాలా మంచి కాన్సెప్ట్‌తో 'సింబా' రూపుదిద్దుకుంది. జగపతిబాబు ఈ చిత్రానికి ప్రధాన బలం' అన్నారు. 'మా సినిమాకు కథే హీరో. ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోండి. ముందు తరాల గురించి ఆలోచించండి... అని చెబుతున్నాం' అన్నారు నిర్మాత రాజేందర్‌రెడ్డి. సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదనీ, ఇంతవరకూ ఇండియన్ స్ర్కీన్ మీద ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. ఈ సినిమాకు కథ, స్ర్కీన్‌ప్లే అందించిన సంపత్ నందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టులో డిమోంటీ కాలనీ 2



అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డిమోంటి కాలనీ 2'. బ్లాక్‌బస్టర్ హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌వర్మ ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తోంది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: హరీశ్ కన్నన్

చిరంజీవి పుట్టిన రోజున



బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, మోహన్ సేనాపతి కీలకపాత్రలు పోషించారు. ఆగస్టు 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేసింది. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న 'పరాక్రమం' చిత్రాన్ని విడుదల చేస్తున్నామని సరోజ్‌కుమార్ చెప్పారు.



దర్శకుడు మారుతి సమర్పణలో భారీ మ్యూజికల్ ఈవెంట్ 'జామ్‌జంక్షన్' సెప్టెంబర్ 6న హైటెక్స్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

అనాథల కథ



సంజయ్ శ్రీరాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్ మహాన్, రితిక ప్రధాన పాత్రలు పోషించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అనాథల బాధ్యత సమాజం తీసుకోకపోతే చాలా దారుణాలు ఎదుర్కోవలసి వస్తుంది అనే ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని ధర్మ దర్శకత్వంలో డాక్టర్ అరవేటి యశోవర్ధన్ నిర్మించారు. ఎన్నో అవరోధాలను అధిగమించి, చిత్రాన్ని పూర్తి చేసి విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.



బొబ్బిలి ఏఎంసీ భవనం

నిధులున్నా.. నిండా సమస్యలే

● అస్తవ్యస్తంగా బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ● రైతు బజారు ఏర్పాటుకు స్థల సమస్య
● కొత్తపాలకవర్గం నియామకం కోసం ఎదురుచూపులు

(బొబ్బిలి)

బొబ్బిలి వ్యవసాయమార్కెట్ కమిటీ(ఏఎంసీ)లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చేతినిండా నిధులు ఉన్నా సరిపడా సదుపాయాలు, సిబ్బంది లేక అవస్థలు పడుతోంది. గోదాముల మరమ్మతులు, నూతన నిర్మాణాలు చేపట్టక అభివృద్ధిలో వెనుకబడిపోతోంది. పాలకవర్గం కూడా గడువు ముగియడంతో కొత్త పాలకవర్గం రాక కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

● బొబ్బిలి ఏఎంసీకి గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గం గడువు ముగిసిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో పాలకవర్గానికి నామినేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. ఈ ఏఎంసీలో 16 పోస్టులు ఉండాలి. స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ, యూడీసీ, అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజరు 3, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజరు 3, టైపిస్టు 1, అటెండరు 1, వాచ్‌మెన్ -1 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఒక కార్యదర్శి, ఇద్దరు సూపర్‌వైజర్లు మాత్రమే పనిచేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, ఇతర తాత్కాలిక సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ● ఒడిశా ప్రాంతం నుంచి బొబ్బిలి మీదుగా విజయనగరం, విశాఖ వైపు మార్గంలో పారాది దగ్గర గల వంతెన పాడవడంతో పట్టణంలో చెక్‌పోస్టును తాత్కాలికంగా మూసివేశారు. దీని ఫలితంగా భారీ వాహనాల రాకపోకలు దారిమళ్లడంతో ఏఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి పడినట్లయింది.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 9.30 కోట్ల రూపాయల నిధులు అందుబాటులో ఉన్నాయి. ఈ నిధులతో అనేక పనులు చేపట్టాల్సి ఉంది. ప్రహరీ, గోదాముల మరమ్మతులు, తెర్లాంలో గోదాము నిర్మాణం వంటివి చేపట్టాలి. ధాన్యం కొనుగోలుపై గత ఏడాది 1.13 కోట్ల రూపాయల కమీషను రాగా, ఈ ఏడాది కోటిన్నర రూపాయల కమీషను ఇంకా రావాల్సి ఉంది. ● ఇటీవల ఎన్నికల ముందు ఇక్కడ వారపు సంతను వైసీపీ నాయకులు చాలా హడావిడిగా ప్రారంభించి నానా హంగామా చేశారు. ఈ సంతకు ఆదరణ కరువడంతో కొద్ది రోజుల పాటు సంతను నిర్వహించి తరువాత మమ అనిపించారు. బొబ్బిలి పట్టణ వినియోగదారులంతా ఎప్పటి నుంచో కోరుకుంటున్న రైతుబజారును ఏఎంసీ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని వైసీపీ నాయకులు, అధికారులు ప్రకటించారు. అది కార్యరూపం దాల్చలేదు.

● బొబ్బిలిలో ఏఎంసీ కార్యాలయంలో ఐదుగోదాములు 7.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. బాడంగి మండలం డొంకినవలసలో నాలుగు గోదాములు 13.80 ఎకరాల్లో ఉన్నాయి. తెర్లాంలో రెండు ఎకరాల యార్డు, రామభద్రపురంలో మూడు ఎకరాల యార్డు ఉంది.

రైతు బజారుకు స్థలసేకరణ జరగాలి

బొబ్బిలి పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఉన్నప్పటికీ తగిన స్థలం అందుబాటులో లేదు. కొత్త పాలకవర్గం నియామకం కోసం, రైతుబజారు స్థలంపై ఎమ్మెల్యే బేబీనాయన ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. స్థలం దొరికే వరకూ ఏఎంసీ ఆవరణలోనే రైతుబజారు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నాం. స్థానికంగా ఐదు గోదాముల్లో ఇటీవల రెండు ఖాళీ అయ్యాయి. డొంకినవలస యార్డులో గల గోదాములను స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు లీజుకు ఇచ్చాం. ఏఎంసీ పరిధిలో పలు మరమ్మతులు, నిర్మాణ పనులు జరగాల్సిఉంది. ఈ ఏడాది మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యం 2.91 కోట్ల రూపాయలు కాగా ఇంతవరకు 30 లక్షలు వసూలైంది.

-కె.ఈశ్వరరావు, ఏఎంసీ కార్యదర్శి

యువకుడి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

రామభద్రపురం, జూలై 24: ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముచ్చర్లవలస గ్రామానికి చెందిన నడగాన సురేష్ (24) డిగ్రీ పూర్తి చేసి ఇంటిలో ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు కోర్టు పనిమీద బుధవారం ఉదయం పార్వతీపురం వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి తలుపులు లోపలి గడియ వేసి ఉండడంతో వెనుకనుంచి చూడగా సురేష్ తన ఇంటిలో ఇనుపకమ్మీకు చీరతో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే పక్కనున్న వారితో తలుపులు బద్దలుకొట్టి పరిశీలించగా అప్పటికే సురేష్ మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి నడగాన రమణకు ముగ్గురు కుమారులు కాగా, సురేష్ మూడో సంతానం. ఇతని మృతికి గల కారణాలు తెలియరావడం లేదని, తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొమరాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తనిఖీలు చేపట్టామని తెలిపారు. సోమినాయుడువలస గ్రామం వద్ద 18 మద్యం సీసాలతో పంతులువలస గ్రామానికి చెందిన వారణాశి తవిటిరాజు మోటారు సైకిల్‌పై వెళుతుండగా పట్టుకున్నట్టు చెప్పారు. మోటారు సైకిల్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

నేడు గ్రామ దర్శిని

వంగర: మండలంలోని ఒనిలో గురువారం గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సల్మాన్ రాజ్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. ● **వేపాడ:** మండలంలోని కొండగంగుబూడి గ్రామ పంచాయతీలో గురువారం గ్రామ సందర్శన, పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వేపాడ ఎంపీడీవో నిశ్చల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ● **రేగిడి:** మండలంలో అంబఖండి-2 సచివాలయం సోమరాజుపేట గ్రామంలో గురువారం గ్రామ దర్శని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి బుధవారం తెలిపారు. అన్నిశాఖల అధికార్లు హాజరుకావాలని, సోమరాజుపేట గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ● **బొబ్బిలిరూరల్:** జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతీగురువారం గ్రామసందర్శన కార్యక్రమంలో భాగంగా రెండో వారం బొబ్బిలి మండలం గొర్లె సీతారాంపురం గ్రామంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి మధుసూదనరావు పాల్గొంటారని తెలిపారు.

కోట సత్తెమ్మ ఆలయంలో అన్నసమారాధన

విజయనగరం రూరల్: నగరంలోని రామానాయుడు రోడ్డులో వేంచేసి వున్న కోట సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ముగియడంతో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పురోహితుడు శ్రీనివాస శర్మ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఒబ్బిలిశెట్టి ఏడుకొండలు, పేర్ల సీతారామయ్యశెట్టి, కెవీఆర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేస్ట్ డీ కంపోజర్ తయారీ

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామంలో రైతులతో వేస్ట్ డీకంపోజర్‌ను తయారు చేయించారు. వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది బుధవారం పొలాలకు వెళ్లి అక్కడే రైతుల చేత వేస్ట్ డీ కంపోజర్ తయారు చేయించారు. దీని వల్ల పంటలకు ఎటువంటి ప్రయోజనాలుంటాయో వివరించారు. చెరకు, వరి, మొక్కజొన్న తదితర పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు.

రేపు విద్యుత్ కోతలు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల ప్రధాన హెడ్ క్వార్టర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ కోతలు అమలు చేస్తున్నట్టు ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 7 నుంచి ఒంటిగంట వరకు ఎల్.కోట, సంతపేట జంక్షన్, సోంపురం జంక్షన్‌లో విద్యుత్ ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఆటల పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట వద్దగల మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా కోకో, కబడ్డీ, రన్నింగ్, చైర్ గేమ్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ యువీకే.పాత్రో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెరువుల్లోకి గంబూషియా చేపపిల్లలు

వేపాడ: దోమల లార్వా నివారణకు చెరువుల్లో గంబూషియా చేపపిల్లలను విడుదల చేసినట్టు వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ధరణి తెలిపారు. గంబూషియా చేపపిల్లలు దోమ లార్వాను ఆహారంగా తీసుకొని దోమల అభివృద్ధిని నివారిస్తాయన్నారు. బుధవారం మండలంలోని వేపాడ, వల్లంపూడి, చామలాపల్లి, ఆకులసీతంపేట, కుమ్మపల్లి, బొద్దాం, పాటూరు, దబ్బిరాజుపేట, నీలకంఠరాజపురం తదితర గ్రామాల్లోని చెరువుల్లో ఈ చేప పిల్లలను వేసినట్టు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవ అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి జూనియర్ కళాశాలను సందర్శించి ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని, దీనికి అధ్యాపకులు సహకరించాలని కోరారు.

రైతులు మెలకువలు పాటించాలి

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ వరినాట్లపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినారు తీసి నారు కట్టలు కట్టేటప్పుడు నారు కొనలు త్రుంచి నాటుకోవాలని, దీనివల్ల వరిలో వచ్చే కాండంతొలచు పురుగు నివారించవచ్చునన్నారు. ఈ మేరకు తెర్లి పాపారావు అనే రైతు పొలంలో ప్రయోగాత్మకంగా సుడోమోనాస్ ద్రావణం తయారుచేసి నారు శుద్ధి ఎలా చేయాలో చూపించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన

విజయనగరం రూరల్, జూలై 24: ఐసీడీఎస్ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో వంద రోజుల పాటు వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో శ్రీనివాసా కళాశాలలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శ్రీనివాసా కళాశాల ఇన్‌చార్జి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. పలు అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కలిగించుకుని ముందుకు సాగాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, రూప, కుసుమ, విద్యార్థులు హాజరయ్యారు.

మాధవబజార్‌లో డ్రైన్ పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్రైన్ నిర్మాణ పనుల్లో సిబ్బంది

రాజాం రూరల్, జూలై 24: పట్టణంలోని మాధవబజార్‌లో మురుగునీటి సమస్యకు అధికారులు చెక్‌పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. కుమ్మరివీధి సమీపంలోని కాల్వలో ఏర్పడిన సమస్య కారణంగా మురుగునీరంతా బజార్‌లో రోడ్‌మీదుగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నడవడం కూడా కష్టంగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఈనెల 15న రోడ్డుపైనే మురుగు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు స్పందించారు. డ్రైన్ నిర్మాణం కోసం ఆర్థికపరమైన ఆమోదం పొంది ఇటీవల పనులు ప్రారంభించారు. వారం రోజుల్లో డ్రైన్ నిర్మాణం పనులు పూర్తవుతాయని, మురుగునీటి సమస్య పరిష్కారం అవుతుందని కమిషనర్ తెలిపారు.

'గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వంగర: గ్రామాల్లో గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపులో గృహనిర్మాణశాఖ అధికారులు భారీ అవకతవకలకు పాల్పడ్డారని టీడీపీ నాయకులు మోహనరావు, కృష్ణమూర్తితో పాటు పలువురు విమర్శించారు. బుధవారం వారు వంగరలో విలేకర్లతో మాట్లాడారు. గతంలో అధికార పార్టీ నాయకులకు తలొగ్గిన గృహనిర్మాణ శాఖ అధికారులు కమీషన్లకు ఆశపడి చాలావరకు పాత ఇళ్లకు బిల్లుతో పాటు కొన్ని గ్రామాల్లో సర్పంచులకు బిల్లులు చేశారన్నారు. ఈ అధికారులపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో తప్పుడు బిల్లులు చెల్లింపులపై ఫిర్యాదు చేస్తామన్నారు. వీరివెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

వసతి గృహాల్లో ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని కొత్తవలస పీహెచ్‌సీ పరిధిలో గల అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు సీతల్‌వర్మ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కస్తూర్బా పాఠశాల, సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్ బాలికల కళాశాల వసతి గృహాల్లో సుమారు 194 మంది విద్యార్థులకు తనిఖీలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వసతిగృహ అధికారులు, జి.పద్మ, కృష్ణ, వైద్య సిబ్బంది బేబీరాణి, సూరిదేముడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న ముస్లింలు

విజయనగరం రూరల్, జూలై 24: నగరంలోని ఉల్లివీధిలో ఉన్న హజరత్ న్యాయత్ షావలీబాబా ఉరుసు ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉల్లివీధి దర్గా నుంచి ప్రారంభమైన ఉరుసు ఉత్సవ ర్యాలీ నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సాగి తిరిగి దర్గా వద్దకు చేరుకుంది. ముస్లిం పెద్దలు, దర్గా ప్రతినిధులు ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం దర్గా వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. దర్గా కమిటీ ప్రతినిధులు ఎస్‌కే సిద్దిక్, ఎండీ బహ దూర్, మహ్మద్ సలామ్ షేక్, అన్వ ర్, ఎస్‌కె బాబా, అజీమ్, షేక్ మస్తాన్‌తో పాటు మేమాన్ మసీదు ప్రతినిధులు పాల్గొన్నారు.

అలజంగి పాఠశాలలో శిక్షాసప్తాహ్



ఆటలపోటీల్లో విద్యార్థులు

బొబ్బిలిరూరల్, జూలై 24: మండలంలోని అలజంగి సీబీఎం పాఠశాలలో బుధవారం శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలురకాల క్రీడలు నిర్వహించారు. హెచ్ఎం కె.కృష్ణదాసు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని కలిగి ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని, ఇందుకోసం మంచి ఆహారం తీసుకోవాలన్నారు. క్రమ శిక్షణతో మెలగాలని హితవు పలికారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది, వెలుగు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అపారిశుధ్యం నిర్మూళనకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని అన్నారు. తరచూ బ్లీచింగ్ పౌడర్ చల్లి నీటిని శుద్ధి చేయాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, పీ హెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్, వెలుగు ఏపీఎం రత్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని సంతగైరమ్మపేట మండలపరిషత్ పాఠశాలలో బుధవారం హెచ్ఎం బంగారునాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం, మూడు జతల షూస్ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగాడ సత్యవతి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రాము, గ్రామపెద్దలు గోగాడ అప్పలసత్యం, ఉపాధ్యాయులున్నారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన అశోక్ గజపతిరాజు



మంత్రి ఆనం రామునారాయణ రెడ్డిని కలిసిన అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, జూలై 24: రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ తదితరులను అశోక్ గజపతిరాజు బుధవారం అమరావతిలో వారి, వారి చాంబర్లలో కలిశారు. అశోక్ గజపతిరాజు వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తదితరులు ఉన్నారు.

లోకేష్‌ను కలిసిన పాలవలస గౌరు



లోకేష్‌కు సమస్యలను వివరిస్తున్న పాలవలస గౌరు

బాడంగి, జూలై 24: గజరాయనివలస ఎంపీటీసీ, రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఏపీ సెక్రటేరియట్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అతని చాంబర్‌లో కలిసి అనేక సమస్యలపై వివరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న సమస్యలపై వినతిపత్రం ఇచ్చామన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో మళ్లీ ఎస్టీ కార్పొరేషన్, ఐటీడీఏకు నిధులు కేటాయించి ఎరుకుల, గిరిజనులకు తమ వృత్తులపై సబ్సిడీలోన్లు మంజూరుచేసి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడాలని కోరినట్టు తెలిపారు.

ఉపాధి కోర్సులో యువతకు శిక్షణ

రాజాం: నిరుద్యోగ యువతీయువకులు, గృహిణులకు స్వయం ఉపాధి, ఉద్యోగఅవకాశాలు మెరుగుపరిచేందుకు రాజాం ప్రభుత్వ ఐటీఐలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు రాజాం ఐటీఐ ప్రిన్సిపాల్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31 తేదీ నుంచి ఇవ్వనున్న శిక్షణకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, గ్రాడ్యుషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఆసక్తి ఉన్నవారు ఆధార్, పాస్‌పోర్టు ఫొటోలు, ఇతర ధ్రువపత్రాలతో రాజాం ఐటీఐలో సంప్ర దించాలని ఆయన కోరారు. వివరాలకు 72860 42743, 81214 50657 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జీవో నెంబరు 117ని వెంటనే రద్దు చేయాలి

విజయనగరం రూరల్, జూలై 24: జీవో నెంబరు 117ని తక్షణమే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జోగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న ఈ జీవోని వెంటనే రద్దు చేయాలన్నారు, ఈ విధంగా చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. 12వ పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలన్నారు. వీటితో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు చిప్పాడ సూరిబాబు, శ్యామ్, గోవిందరావు, బొబ్బిలి ఈశ్వరరావు, చిట్టిబాబుతో పాటు పలువురు ఎస్టీయు నాయకులు పాల్గొన్నారు.

ఖండ్యాం డిఫెన్స్ యూత్ శ్రమదానం

రేగిడి: మండలంలో ఖండ్యాం డిఫెన్స్ యూత్ బుధవారం శ్రమదానం నిర్వహించారు. ఖండ్యాం- వెంకటాపురం గ్రామాల మధ్య దాదాపు 2కిలోమీటర్లు రోడ్డుకు రెండువైపులా జంగల్‌పేరుకుపోవడంతో గ్రామానికి చెందిన ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలో పనిచేస్తున్న ఉద్యోగులు జంగల్‌క్లియరెన్స్ ముందుకు వచ్చారు.

తల్లికి వందనంపై ప్రకటన హర్షణీయం: కోండ్రు

రాజాం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉందని, ఇందుకు మూడోరోజు అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి లోకేష్ ప్రకటన చేయటం హర్షణీయం అని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ అన్నారు. ఈమేరకు రాజాంలోని ఆయన కార్యాయలం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలుచేస్తామని, ఇందులో అపోహలు అవసరం లేదని, దీనిపై సమగ్రకసరత్తు జరుగుతుందని పేర్కొన్నారు. తల్లికి వందనంపై వైసీపీ విష్రప్రచారం మానుకోవాలని హితువు పలికారు.

ఏపీ అభివృద్ధికి ఊపిరిపోసిన కేంద్రబడ్జెట్

విజయనగరం దాసన్నపేట, జూలై 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి దూరమై, ప్రజల్లో తీవ్ర అనిశ్చితి అలుముకున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించిన నిధులతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు తీస్తుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్ చాలా వినసొంపుగా ఉందని రాష్ట్రానికి రెండు కళ్లలాంటి అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై ప్రత్యేకత చూపడం హర్షణీయమన్నారు.

● 2024-25 కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించడం హర్షణీయమని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన సీనియర్ ఉపాధ్యక్షుడు, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాజీ డైరక్టర్ భోగాపురపు వాయునందన శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర విభజనతోనూ, గత పాలకుల తప్పిదాల వల్ల ఆర్థికంగా, అభివృద్ధి పరంగా తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి నేడు కేంద్రం ప్రకటించిన రూ. 15 వేల కోట్ల రూపాయలు వల్ల రాజధాని అమరావతికి పోలవరం ప్రాజెక్టుకు భారీ నిధులు కేటాయించడంతో ఏపీ భవిష్యత్తు మారుతుందన్నారు.

అమరావతికి సాయం హర్షణీయం

రాజాం: కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రఅభివృద్ధికి పెద్దపీట వేయటం, ప్రధానంగా అమరావతికి సంపూర్ణసాయం ప్రకటించటం హర్షణీయం అని రాజాం బీజేపీ టౌన్ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్‌కుమర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధికి బిజెపి సహకరిస్తుందన్నారు.

కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు



బడ్జెట్ కేటాయింపులపై హర్షం తెలుపుతున్న టీడీపీ నేతలు

లక్కవరపుకోట (కొత్తవలస): రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులను కేద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించడం పట్ల కొత్తవలస మండల తెలుగుదేశం పార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకులు బొబ్బిలి అప్పారావు, కోళ్ల శ్రీను ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్ల కేటాయింపు, పోలవరం పనులకు సహకారం ఇలా అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అయ్యరక సంఘ నాయకులు బంగారు రమేష్, కొత్తవలస మాజీ సర్పంచ్ కొరుపోలు అప్పారావు, అన్నంరెడ్డి వెంకటరమణ, రాజ్ టైలర్, నక్క రాజు, చినరాము తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



సోంపురం జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వేపాడ, జూలై 24: గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మండలంలోని సోంపురం జంక్షన్‌లో బుధవారం లక్కవరపుకోట, వేపాడ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు కే.రాజేష్, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ విశాఖ-అరకు రహదారిలో గంజాయి రవాణా జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు.

వర్షాలకు కూలిన గోడ



కూలిన గోడను పరిశీలిస్తున్న దృశ్యం

దత్తిరాజేరు, జూలై 24: మండలంలోని గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గడసాం గ్రామానికి చెందిన కొల్ల కాసులమ్మకు చెందిన పెంకిటిల్లు గోడ బుధవారం కూలిపోయింది. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎడతెరపిలేని వర్షాలకు గోడ పూర్తిగా నానిపోయి కూలిపోయినట్టు వీఆర్వో గోవింద తెలిపారు. ప్రమాదకరంగా ఉండడంతో ఇంటిలో ఉండవద్దని బాధితురాలు కుమారుడు నాగరాజు ఇంటికి తరలివెళ్లాలని సూచించారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మజ్జి మహేష్ బాధితురాలును పరామర్శించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈయన వెంట మాజీ వైస్ సర్పంచ్ నారాయణప్పడు, వార్డు మెంబరు అప్పలనాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దుకాణంలో మంటలు

రాజాం రూరల్: పట్టణానికి చెందిన తిరుపతిరావు మార్కెట్‌యార్డుకు ఎదురుగా ఆర్నెళ్ల క్రితం డిపార్ట్‌మెంటల్ షాపును ఏర్పాటు చేశాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో షాపు మూసివేసి ఇంటికి వెళ్లి పోయాడు. అయితే అర్ధరాత్రి దాటాక షాపులో నుంచి మంటలు రావడాన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. క్షణాల్లో ప్రమాదస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న తిరుపతిరావు వెంటనే షాపు వద్దకు చేరుకుని లబోదిబోమన్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరి గిందా.. లేదా ఎవరైనా దొంగతనం చేసేందుకు ప్రయత్నించారా అనేది తేలాల్సి ఉంది. షాపు యజమాని తిరుపతిరావు మాట్లాడుతూ సుమారు లక్ష రూపాయల ఆస్తనష్టం జరిగిందని, దీనిపై పోలీసులకు ఇంకా ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశాడు.

ధాన్యం కొనుగోలులో అవకతవకలపై విచారణ



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

దత్తిరాజేరు, జూలై 24: మండలంలో 2021-22 సంవత్సరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగాయని గతంలో లోకాయుక్తాలో అందిన ఫిర్యాదు మేరకు తోటపల్లి కాలువ రెండో విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జోషఫ్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా 2021-22 సంవత్సరంలో రైతులకు ధాన్యం డబ్బులు అందాయి కానీ ట్రాన్స్‌పోర్టు, హమాలీల చార్జీలు అందలేదని మండలంలోని గడసాం గ్రామానికి చెందిన మండల పైడిరాజు చేసిన ఫిర్యాదు మేరకు ఈ దర్యాప్తు చేపడుతున్నామని ఆయన తెలిపారు. 2023వ సంవత్సరంలో సంబంధిత అధికారులను దర్యాప్తు చేపట్టాలని తెలిపామని, దాని మేరకు బుధవారం అధికారులను వివరాలు కోరగా ఫిర్యాదుదారుడు హాజరుకాలేదని తెలిపారు. దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ధనం, మండల వ్యవసాయాధికారిణి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

సంగాంలో మధ్యాహ్న భోజన నిర్వహణపై..



సంగాం జడ్పీలో విచారణ చేస్తున్న మోహనరావు

వంగర, జూలై 24: సంగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణపై బొబ్బిలి డిప్యూటీ డీఈవో మోహనరావు బుధవారం విచారణ నిర్వహించారు. నిర్వాహకులు సరిగా వంటలు చేయకపోగా పరిశుభ్రత పాటించడంలేదని గ్రామానికి చెందిన చిగిరి నరిసర్శింహులుతో పాటు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ డీఈవో పాఠశాలను సందర్శించారు. ఫిర్యాదుదారుడు, వంట నిర్వాహకులను వేరువేగా విచారించారు. వంటలనాణ్యత పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం నిర్వహణలో అలసత్వం వహించరాదని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీచేశారు. దర్యాప్తు నివేదికలు ఉన్నతదికాలుకు అందజేస్తానన్నారు. అనంతరం వంగర జెడ్పీలో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు చిన్నచిన్న లఘు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఎంఈవో దుర్గారావు, నాగభూషణదొర తదితరులు ఉన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నవారికే ఆధార్ అప్‌డేట్

రామభద్రపురం, జూలై 24: ఆధార్ అప్‌డేట్‌లో ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నవారికి మాత్రమే అప్‌డేట్ చేయాలని ఆధార్ నిర్వాహక కేంద్రాలకు తహసీల్దార్ ఆకుల సులోచనారాణి సూచించారు. మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్‌లో ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖాధికారులు కూడా పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో బుధవారం ఆధార్ నమోదు ప్రక్రియకు సంబంధించిన సంచార శిబిరాన్ని నిర్వహించారు. ఆధార్ కార్డులు లేని వారు, సవరణలు అవసరమైన వారు అందరికీ ఈ శిబిరంలో సేవలందించారు. చుట్టుపక్కల గ్రామాల వారంతా అధిక సంఖ్యలో హాజరై ఆధార్ సేవలను వినియోగించుకున్నారు.

విద్యార్థి సంఘం నాయకుడిపై కేసు

విజయనగనరం రూరల్: జేఎన్‌టీయూ పూర్వపు వైఎస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య విద్యార్థి సంఘ నాయకుడు విజయనగరం జిల్లా గుర్ల ప్రాంతానికి చెందిన సుంకరి రమణమూర్తిపై న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. తనపై రమణమూర్తి ఆరోపణలు చేశారని, అవి ఆయన 15 రోజుల్లోగా నిరూపించాల్సి ఉందని, లేదంటే పరువు నష్టం దావా వేస్తానని ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- రాకపోకలకు తప్పని ఇక్కట్లు

గరుగుబిల్లి: మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అధ్వానంగా తయారవ్వడంతో నిత్యం ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. తోటపల్లి పంచాయతీ నందివానివలస గ్రామ రహదారులు అత్యంత దారుణంగా తయార య్యాయి. వర్షం కురిసిందంటే ఈ మార్గంలో ప్రయాణం నరకయాతనగా తయారవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో తోటపల్లితో పాటు జియ్యమ్మవలస మండలం సింగనాపురం, గదబవలస, కుదమ గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలోని రహ దారిని మెరుగు పర్చాలని అనేకసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పంట పొలాలకు అనుకూలంగా ఉండే రహదారి అధ్వానంగా తయారు కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారి మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నందివానివలస రహదారి దుస్థితి ఇదీ



చెరువు కాదు.. బైపాస్ రహదారే..

పార్వతీపురం టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రంలో బైపాస్ రహదారి చెరువును తలపిస్తోంది. బైపాస్ రహదారిపై వరదనీరు నిలిచిపోవడం వల్ల చిన్న గుంతలు పడడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతు న్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ప్రజారోగ్య శాఖా ధికారులు బైపాస్ రహదారిలోని వరదనీటిని మళ్లించాలని వాహన చోదకులు కోరుతున్నారు.



శాకంబరిగా జ్ఞానసరస్వతి

పట్టణంలోని నక్కలపేటలో గల శ్రీషిర్డీసాయిబాబా సమేత సకల దేవాలయాల ప్రాంగణంలో బుధవారం జ్ఞానసరస్వతీ దేవి శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమం కమిటీ అధ్యక్షులు పల్లా కొండలరావు, ఆలయ ప్రధాన అర్చకులు పర్రి శరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్ఞానసరస్వతీ దేవికి దాదాపు ఐదు వందల కేజీల వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. -పాలకొండ

అతివేగం ప్రమాదకరం

- న్యాయాధికారి విజయరాజ్‌కుమార్

పాలకొండ: వాహనదారులు నిబంధనలు పాటించాలని, అతివేగం ప్రమాదకరమని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు తప్పనిసరిగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు బి.రామ్మోహన్‌రావు, ఎం.కోటేశ్వరరావు, ఎం.జగన్మోహన్‌రావు, కె.వెంకటరమణ, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మణరావు, యూనియన్ నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు, డిపో కార్మికులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి విజయరాజ్‌కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పాలకొండ: కొండాపురం గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఏఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ర్యాలీలో జనసేన నాయకుడు దొంపాక సాయి పాల్గొన్నారు.



బాధితుని ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

ఎరకయ్యగూడలో వైద్య శిబిరం

భామిని: ఆదివాసీ గిరిజన గ్రామం ఎరకయ్యగూడలో బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదరం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలు ఉన్నవారికి రక్తపూతలు తీసి.. ఉచితంగా మందులు అందించారు. దిమ్మిడిజోలలో డెంగ్యూ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.



నరసాపురం ఎంపీడీవో మృతికి సంతాపం తెలుపుతున్న ఉద్యోగులు

నరసాపురం ఎంపీడీవో మృతి బాధాకరం

సీతంపేట: నరసాపురం ఎంపీడీఓ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని సీతంపేట ఎంపీడీఓ గీతాంజలి అన్నారు. బుధవారం తన కార్యాలయం ఎదుట ఎంపీడీఓ వెంకటరమణ మృతికి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మౌనం పాటించారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టండి

పార్వతీపురం టౌన్: ఆడపిల్లలను వేధించడంతో పాటు నిర్లక్ష్య వైఖరితో అతివేగంగా వాహనాలను నడుపుతున్న ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు జీవీ రమణ, జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడులు ఎస్పీ మాధవరెడ్డిని కోరారు. బుధవారం ఎస్పీని కలిసి సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ర్యాగింగ్‌పై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ, రవాణాకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు.



ఎస్పీ మాధవరెడ్డిని కలిసిన మానవ హక్కుల కమిటీ సభ్యులు

ఆదివాసీలకు ఉపాధిపై చైతన్యం

సీతంపేట: ఆదివాసీలకు జీవన ఉపాధి పెంపొందించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సంతోష్ తెలిపారు. బుధవారం జయపురం గ్రామంలో గిరిజన రైతులకు నిర్వహించిన వ్యవసాయ మేలుకోలు- సుస్థిరమైన జీవన ఉపాధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సాయినితిష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్ సంగమేష్, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.



జయపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అధిక లోడుతో వెళ్లే డ్రైవర్లకు జరిమానాలు విధిస్తున్న అధికారులు

అధిక లోడుతో వెళితే కఠిన చర్యలు

పార్వతీపురం టౌన్: ఆటో, జీపు తదితర వాహనాల్లో అధిక లోడుతో వెళ్తే కఠిన చర్యలు చేపడతామని పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గాదేవి, ఏఎంవీ కాశీరాం నాయక్ హెచ్చరించారు. బుధవారం పార్వతీపురం వెంకంపేట గోరీల కూడలి, తదితర ప్రాంతాల్లో పరిమితికి మించినప్రయాణికులతో వెళుతున్న 16 ఆటో, తదితర వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. రూ.40 వేలు జరిమానా వసూలు చేసి, వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఇటీవల ఆటో, తదితర వాహనాలు అధిక లోడ్‌లతో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించినట్టు తెలిపారు.



అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను వివరిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

వీరఘట్టం: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫోన్ నెంబరు 08941-260111, అగ్నిమాపక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 101కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.



బాలిక ఆశ్రమ పాఠశాలలో క్రీడలు ప్రారంభిస్తున్న డీడీ

విద్యతో పాటు క్రీడలు అవసరం

సీతంపేట: గిరిజన విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతగానో అవసరమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అన్నదొర స్పష్టం చేశారు. బుధవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో పి.నారాయుడు, ఏఎంవో కోటిబాబు, హెచ్‌ఎం పద్మశ్రీ, సీఎంవో చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువుల శాలలో విద్యా బోధన

గరుగుబిల్లి: మండలంలోని కారివలస, సీమలవానివలస పాఠశాలలు అత్యంత దయనీయంగా తయారయ్యాయి. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కారివలస పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు బుధవారం పశువుల శాలలో బోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలల దుస్థితిపై నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ పలుమార్లు ఎంఈవో, ఎంపీడీవోల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు పాఠశాల కూలితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఎంఈవో అక్రమాలపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



కారివలసలో పశువుల శాలలో బోధిస్తున్న దృశ్యం

అగ్నిమాపక కేంద్రానికి స్థలం ఇప్పించండి

- హోం మంత్రిని కోరిన ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో పూర్తిగా శిథిలావస్థలో ఉన్న ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి, గారమ్మతల్లి ఆలయానికి అవసరమైన స్థలం ఇప్పించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హోంమంత్రి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు బుధవారం వారికి వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



హోం మంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మొక్కలను నాటుదాం

వీరఘట్టం: మండలంలోని వెలుగు సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ శ్రీహరిరావు మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున మండలంలో 50 ఎకరాల్లో మొక్కలు నాటాలని, ఇందులో 44 ఎకరాలు జీడి మొక్కలు, ఆరు ఎకరాలు మామిడి మొక్కలు నాటాలన్నారు. ఏపీవో సత్యం నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రయత్నం అభినందనీయం

గరుగుబిల్లి: కురుపాం నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాన సమస్యలైన పూర్ణపాడు - లాబేసు వంతెన, పార్వతీపురం - కూనేరు అంతర్ రాష్ట్ర రహదారి, తోటపల్లి ప్రాజెక్టు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీ వాణి పదేళ్లలో సమస్యలపై దృష్టి సారించలేదన్నారు.

గ్రంథాలయ పితామహుడు వెంకటరమణయ్య



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిన మహోన్నత వ్యక్తి ఐఎన్‌కే వెంకటరమణయ్య అని నల్ల మధుసూదనరావు అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగు నీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవా హం నిలకడగా ఉంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొంతమేర వరద ప్రవాహం ప్రాజెక్టులోకి చేరుతోంది. పైప్రాంతం నుంచి 2 వేల క్యూసెక్కులకు పైబడి వరద చేరడంతో ప్రాజెక్టు అధికారులు స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు మళ్లిస్తున్నారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.10 మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. పైప్రాంతం నుంచి వచ్చిన వరద ప్రవాహాన్ని దిగువకు మళ్లించడంతో పాటు ప్రధాన కాలువల నుంచి సాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తున్నారు. స్పిల్‌వే గేట్ల నుంచి వెయ్యి క్యూసెక్కులకు పైగా, కాలువల నుంచి 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఒడిశాలో వర్షాలు కురిస్తే అధికంగా వరద ప్రవాహం ప్రాజెక్టులోకి చేరే అవకాశం ఉంది.

చదువుతో పాటు ఆటలు ముఖ్యం

వీరఘట్టం: కత్తులకవిటి ప్రాథమిక పాఠశాలలో బుధవారం శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి.సత్యం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

పారిశుధ్య పనులపై అలసత్వం వద్దు

గరుగుబిల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహించరాదని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకరరావు అన్నారు. బుధవారం వివిధ గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలన్నారు. దోమలు విజృంభించకుండా నివారణ మందును పిచికారీ చేయించాలని సూచించారు. తాగునీటి వనరుల ప్రాంతాల్లో నీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తం గా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్ ఆవాల సింహాచలం, కన్నయ్య, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



తోటపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ వీరఘట్టం లైన్ నిర్వహణ పనుల నిమిత్తం ఈనెల 26న శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ టి.జి.కె.మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపురం, గొట్టమంగళాపురం, చిన్నమంగళాపురం, యరకారాయపురం, తంపటాపల్లి, బుక్కూరు, రాజుపేట, అర్థలి, భాసూరు, ఎల్ఎల్‌పురం, పద్మాపురం, చినకోటిపల్లి, పెదకోటిపల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.